

ఆర్‌టిసి బస్సులను పెంచాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఆర్‌టిసి బస్సు సర్వీసులను పెంపుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలం నుంచి కాకినాడ, ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తున విద్యార్థులు వివిధ కళాశాల, పాఠశాలలకు వెళ్తున్నారని అన్నారు. ఆర్‌టిసి బస్సులు సమయపాలన లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనికితోడు స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళల ప్రయాణాలు అధికం అయ్యాయని అన్నారు. మహిళల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆయన కోరారు.

మత్స్యకారుల గోడు చెవికెక్కేనా..?

-నేడు ఉప్పాడలో డిసిఎం పవన్ పర్యటన


-బాధితుల డిమాండ్లపై స్పందిస్తారా..?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యు.కొత్తపల్లి

ఫార్మా కంపెనీలు, ఇతర పారిశ్రామిక సంస్థలు విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలతో సముద్రంలో మత్స్యసంపద నాశనం అవుతోంది. దీంతో జీవనోపాధిని కోల్పోతున్నామంటూ మత్స్యకారులు ఇటీవల ఉద్యమానికి తెరలేపారు. రోడ్డెక్కి రెండు రోజులపాటు ఆందోళనను నిర్వహించారు. ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్ఎ పవన్‌కల్యాణ్ అమరావతి నుంచి ఓ ప్రకటనను విడుదల చేశారు. అక్టోబర్ 9 లోపు నియోజకవర్గానికి వస్తానని, దీనిపై ప్రత్యేకంగా మత్స్యకారులతో కలిసి ఒక కమిటీని నియమించి మత్స్యకారులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. అయితే ఒకరోజు ముందు మత్స్యకారులు లేకుండానే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసినట్లు మంగళవారం ప్రకటించింది. అయితే కొందరి మత్స్యకారుల ప్రతినిధులను కమిటీలో చేర్చుకునేందుకు కలెక్టరుకు అవకాశం ఇచ్చారు. అయితే మత్స్యకార ప్రతినిధులను ఎవరెవరిని చేర్చుకుంటారు. నిజంగా వారి సమస్యలు వాణి వినిపించే వారిని నియమిస్తారా.. లేక అధికార పక్షానికి చెందిన వారిని కమిటీలో చేర్చుకుంటారా అనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు. దీనిపై బాధిత మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు వినేది ఎవరు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పవన్ ఉప్పాడలో పర్యటించనున్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం ఉప్పాడలో నేరుగా మత్స్యకారులను కలిసి వారితో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా వారు ఆశిస్తున్నట్లుగా పవన్ కల్యాణ్ స్పందిస్తారా.. డిమాండ్లను అంగీకరిస్తారా.. కంటి తుడుపు చర్యలకే పరిమితం అవుతారా.. అన్నది చర్చనీయాంశంగా మారింది.

ఏడాదిగా ఉద్యమం

తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం ఆదుకోవాలనే డిమాండ్లు మత్స్యకారులు ఎంతో కాలంగా వినిపిస్తున్నారు. దీనిపై ఏడాది కాలం నుంచి ఉద్యమం చేస్తున్నారు. గత నెలలో రెండు రోజుల పాటు మరోసారి ఆందోళన తీవ్రతరం చేశారు. వేలాదిమంది మత్స్యకారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి న్యాయం కోసం రోడ్డెక్కారు. పిఠాపురం నియోజకవర్గ ఎంఎల్ఎ, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని పట్టు పట్టారు. దీంతో కలెక్టర్ సహ అధికార యంత్రాంగం మత్స్యకారులకు నచ్చజెప్పడంతో తాత్కాలికంగా ఉద్యమాన్ని వాయిదా వేశారు. ఈ నెల 9 తేదీలోపు మాకు న్యాయం చేయాలంటూ గంగపుత్రులు గడువు పెట్టారు. లేకపోతే 13 నుంచి మళ్లీ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఇక్కడికి పర్యటనకు వస్తున్న పవన్ స్పందిస్తారా.. బాధితుల గోడు వింటారా.. సమస్య పరిష్కారానికి ఏ మేరకు కృషి చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళన (ఫైల్ ఫోటో)

ఫార్మా కాలుష్యంతో నష్టం

తీరం వెంబడి ఫార్మా కాలుష్యంతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లడమే కాకుండా తమ మనుగడకే ముప్పు ఏర్పడుతోందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. దివీస్, అరబిందో వంటి పరిశ్రమల నుంచి పెద్దఎత్తున రసాయనాల వ్యర్థాలు సముద్రంలోకి పెద్దఎత్తున విడుదల అవుతోంది. ఈ రసాయన వ్యర్థాలతో మత్స్యసంపద నాశనం అవుతోంది. దీనిపై తమకు కలుగుతున్న నష్టాన్ని అధికారులకు పలు రూపాల్లో మత్స్యకారులు తీసుకెళ్లారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు.

డిసిఎం ఎలా స్పందిస్తారు..?

మత్స్యకారుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్ చర్చలు జరిపి వాళ్ల సమక్షంలోనే పవన్ కల్యాణ్ పంపించిన లేఖ చదివి వినిపించారు. అసెంబ్లీ సమావేశాలు, అనారోగ్యం కారణం వలన దసరా తర్వాత వస్తానని తెలియజేయడంతో ఉద్యమాన్ని వాయిదా వేశారు. అక్టోబరు 9 లోపు మత్స్యకారుల వద్దకు వస్తానన్నా డిసిఎం హామీపై గురువారం ఇక్కడికి రానున్నారు. దీంతో మరోసారి డిసిఎంపై ఒత్తిడి పెంచేందుకు తీర ప్రాంత వాసులు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారాన్ని ఎలా పరిష్కరించాలనే దానిపై పవన్ తీవ్ర స్థాయిలో సతమతమవు తున్నట్లుగా తెలుస్తోంది. ఆయనే స్వయంగా వచ్చి తమ సమస్య పరిష్కరించే వరకు సముద్రంలో వేటకు వెళ్లేది లేదంటూ స్థానిక మత్స్యకారులు వేటకు సైతం వెళ్లకుండా ఇళ్ల వద్దే కాలం వెళ్లదీస్తున్నారు. కాలుష్యం వలన పడుతున్న ఇబ్బందులు పాలకులకు పట్టవా అంటూ ప్రశ్నిస్తున్నారు. పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గ సమస్య కావడం, పైగా ఎన్నికల సమయంలో వారాహి యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ కావడంతో ఎలా స్పందిస్తారో అని మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. ఆయన బాధ్యత వహిస్తున్న శాఖల్లో ఒకట్కైన పర్యావరణ శాఖకు సంబంధించిన వివాదం కావడంతో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది. పవన్ బాధితుల పక్షాన నిలు స్తారా? పరిశ్రమలకు అనుకూలంగా వ్యవహరిస్తారా అనే చర్చ జరుగుతోంది.

ఎదురు చూస్తున్నాం



మా సమస్య చాలా పెద్దది. మా మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వేటకు వెళ్లినా చేపలు లభ్యం కావడం లేదు. ఖర్చులు అవుతున్నాయి తప్ప ఉపయోగం లేదు. అందుకే ఉద్యమం చేస్తున్నాం. పవన్ కల్యాణ్ ఎదుట మా గోడుని వినిపిస్తాం. కమిటీలో మా వాణిని వినిపించే వారికి మాత్రమే చోటు కల్పించాలి.

-ఉమ్మిడి జగన్నాథం, ఉప్పాడ

ఆందోళన ఉధృతం



గత కొంతకాలంగా వేటకు వెళ్లినా ఉపయోగం లేదు. మాకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధతం చేస్తాం.ఇక్కడికి వస్తున్న డిప్యూటీ సిఎం మా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరుకుంటున్నాము. స్పందించకపోతే 13 నుంచి మళ్లీ ఉద్యమ కార్యాచరణ ప్రారంభిస్తాం.

-చోడిపిల్లి ప్రసాద్, ఉప్పాడ

బాణసంచా ప్రమాదం దురదృష్టకరం

-క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం

-సిఎంతో చర్చించి నష్టపరిహారం చెల్లిస్తాం

-మీడియాతో హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

ప్రజాశక్తి - సామర్లకోట

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వి.సావరం గ్రామంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. బాణసంచా ప్రమాద ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆమె బుధవారం మధ్యాహ్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మీడియాతో మాట్లాడారు. జరిగిన సంఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారని అన్నారు. ఆయన ఆదేశాలతో తాను సంఘటనా స్థలానికి బయలుదేరి వెలుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారని, వారికి మెరుగైన వైద్యం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్షతగాత్రులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బాణసంచా తయారీ కేంద్రం యాజమాని ఈ ప్రమాదంలో మృతి చెందారని ఆమె వెల్లడించారు. ఇకపై ఎక్కడైనా అనధికారిక బాణసంచా కేంద్రాలు లేదా షాపులు ఉన్నా ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా అధికారులు రెండు నెలలకొకసారి ఆయా బాణసంచా



తయారీ కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఎక్కడైనా అధికారికంగా బాణసంచా కేంద్రాలకు అనుమతులు ఇస్తే వాటికి పూర్తి భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె ప్రకటించారు. ఈ సావరంలో జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి మృతులకు, క్షతగాత్రులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై ప్రకటన చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

'మత్స్యకారుల డిమాండ్లు పరిష్కరించాలి'

ప్రజాశక్తి- కాకినాడ

ఉప్పాడ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి మత్స్య కార్మిక సంఘం నాయకులు చెక్కా రమణి, ఉప్పాడ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో వారి డిమాండ్ల పరిష్కారం కోసం డిప్యూటీ సిఎం, పిఠాపురం ఎంఎల్ఎ పవన్ కల్యాణ్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాళ్లరేవు, ఐ.పోలవరం మండలం బైరవపాలెం మొగ దగ్గర నుంచి తుని రూరల్ మండలం వరకూ ఉన్న గ్రామాల్లో మత్స్యకారులు వేటకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. కాలుష్య కారక పరిశ్రమలు వల్ల మత్స్య సంపద నాశనం అవుతుందని అన్నారు. ఇటీవల వరుస తుపాన్లు వల్ల వేటకు వెళ్లలేక పోతున్నారని, సంపద లేక పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కోసం అప్పుల పాలౌతున్నారని అన్నారు. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, దీనికోసం శాశ్వత ప్రాతి పదికన ఒక బోర్డు ఏర్పాటు చేసి నిధి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో గురువారం మత్స్యకార ప్రతినిధులతో పవన్ కల్యాణ్ చర్చలు ఫలప్రదం కావాలని, న్యాయమైన సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్టు వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

తైక్వాండో, హ్యాండ్‌బాల్ పోటీలలో 'ప్రతిభ విద్యానికేతన్' విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం విద్యాసంస్థల అధినేత ఎస్‌వివిజి.ప్రకాష్ మాట్లాడుతూ కాకినాడలోని డిఎస్ఎ మైదానంలో మంగళవారం ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో క్రీడలో అండర్-14 విభాగంలో తమ విద్యార్థి బి.చందుకార్తీక్, హ్యాండ్‌బాల్ క్రీడలో అండర్-17 గర్ల్స్ విభాగంలో ఎం.గగనవర్ష, అండర్ -14 గర్ల్స్ విభాగంలో ఎస్.అమృతవైష్ణవి, డి.దేవీ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత ఎస్‌వివిజి.ప్రకాష్, పెద్దాపురం ప్రతిభ స్కూల్ డైరెక్టర్ సుధారాణి, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి, పీడీలు కె.సాయిలక్ష్మి, వి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే మండలంలోని వేట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బీచ్ వాలీబాల్ విభాగంలో జి.హేమంత్, పి.మహేంద్ర, అండర్-14 గర్ల్స్ రగ్బీ విభాగంలో పి.లికిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం పి.అనురాధ, ఎస్ఎంసి ఛైర్మన్ పి.నాగశివ, తదితరులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రకాష్

తపాల బిళ్లల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక సూర్యకళా మందిరంలో ఫిలోత్సవం-2025 జిల్లా స్థాయి పిలాటలిక్ ఎగ్జిబిషన్ (తపాలా బిళ్ళల ప్రదర్శన) కార్యక్రమం బుధవారం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు పాల్గొని మాట్లాడారు. ఫిలాటలీ అభిరుచి అతి ప్రాచీనమైనదని, తపాలా శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపుల వలన ఈ కళ అజరామరంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. సాంకేతికత పెరుగుతున్న క్రమంలో ప్రతీ ఒక్కరూ తపాలా బిళ్ళల సేకరణను మంచి అలవాటుగా మార్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ రామచంద్రరావు సూచించారు. తపాల శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపులు వల్ల ఆ ప్రాచీనమైన కళ అజరామంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. పోస్టల్ స్టాంపులు విద్యార్థులలో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. డివిజనల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ మాట్లాడుతూ ఈ ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ గురువారం కూడా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పోస్టల్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గంటి రామకృష్ణ, సామర్లకోట అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్స్ పివి.రమణమూర్తి, డి.అనిల్ అంబేద్కర్‌కుమార్, ఇతర ఉద్యోగులు ముడుగు లక్ష్మణ్‌కుమార్, బి.బ్రహ్మంనాయక్, బి.జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



తపాలా బిళ్లల ప్రదర్శనను తిలకిస్తున్న అటవీ అధికారి

పార్టీ విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. బుధవారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో ప్రత్తిపాడు మండలం పెద శంఖర్లపూడి గ్రామానికి చెందిన వైసిపి నాయుకులు రాసంశెట్టి రంగా, ఇతర నాయకులు గిరిబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, మొరుకుర్తి నాగవినోద్‌యాదవ్, రాసంశెట్టి వీరబాబు, అప్పికొండ లచ్చబాబు, రాసంశెట్టి సత్తిబాబు, జువ్వల బాజ్జి, మొల్లేటి వెంకన్న, కాళ్ళ వీరబాబు, గంగబాబు, బచ్చల శ్రీను పాల్గొన్నారు.



గిరిబాబును సత్కరిస్తున్న వైసిపి నాయకులు

బాణసంచా పేలుళ్లపై యనమల దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - కోటనందూరు

అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం జరిగిన బాణ సంచా పేలుళ్ల పట్ల టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై స్థానిక ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. మతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

10న మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 10వ తేదీన చిన బొడ్డు వెంకటాయపాలెం జడ్‌పి హైస్కూల్‌లో మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం కెఆర్‌కె.సాయిప్రసాద్, పిజికల్ డైరక్టర్ ఎల్.చంద్రావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎంపికైన క్రీడాకారులంతా ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభ చాటాలని కోరారు. ఉదయం 8 గంటలకు క్రీడా పోటీలతో పాటు పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

ఆదిత్యలో రోబోటిక్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్లాగ్‌షిప్ రోబోటిక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హైదరాబాద్‌కు చెందిన హాక్ బోట్స్ ఫౌండర్ అండ్ సిఇఒ శ్రీమహాన్ ఆర్‌కె ఇసిఇ రోబోటిక్స్ ఫండమెంటల్స్, నూతన ప్రాజెక్ట్స్ ఎలా అభివృద్ధి చేయవచ్చు అనే అంశాలపై వివరించారు. ప్రో వైస్ -ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అన్ని రంగాలలో రోబోటిక్స్ యొక్క విశిష్టత, ప్రాధాన్యతపై వివరించారు. ఎలక్ట్రానిక్స్ విభాగం అధిపతులు డాక్టర్ ఆర్‌వివి. కృష్ణ, సిహెచ్.జానకిదేవి మాట్లాడుతూ విద్యార్థులందరూ రోబోట్స్‌ని తయారు చేసే విధానంలోని మెళకువలను అందిపుచ్చుకో వాలన్నారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వై.సుబ్బారావు డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ జి.సంజీవ్‌రావు మాట్లాడారు. ఈ సదస్సులో ఎలక్ట్రానిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీమహాన్

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తాళ్లరేవు

వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలందరూ బాధ్యత వహించాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్.రామచంద్రరావు అన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు కార్యక్రమం కోరంగి అభయారణ్యంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల ఆవాసం చాలా పెద్దదని అన్నారు. సహజంగానే వాటికి ఆహారం లభిస్తుందని, ప్రజలు వన్యప్రాణులకు ఎటువంటి ఆహారం అందించ కూడదని అన్నారు. వన్యప్రాణులకు ఉపకారం చేయాలనుకుంటే పండ్ల మొక్కలను పెంచి వదిలేస్తే ఆ పండ్లు తింటాయన్నారు. వన్యప్రాణుల సంరక్షణ ఒక అటవీ శాఖ మాత్రమే కాదన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి శ్రీహర్ష, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస్, పప్పెట్రీ షో పిల్లి గోవిందరాజులు, మ్యాజిక్ షో వివిఎస్‌వి.రమణమూర్తి, సిబిఇటి ఛైర్మన్ పినపోతు ధనుంజయ, వైస్ ఛైర్మన్ బొమ్మిడి ఆదిలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్లు కె.సిద్దార్థ, ఎస్.వీరభద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న అటవీ అధికారులు

సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన


ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ, ఇర్రిపాక, మర్రిపాక గ్రామాల్లోని 3500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏలేరుపై సాగునీటి ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నట్లు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తెలిపారు. బుధవారం మామిడాడలో సాగునీటి ప్రాజెక్టుకు శంకు స్థాపన చేసే ప్రాంతాన్ని ఆయన పోలవరం ఇఇ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతుల పాపారావు పేరుతో రూ.3.49 కోట్లతో నిర్మించే నీటిపారుదల పథకానికి ఈ నెల 12న నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ అడపా భరత్, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, పాలచర్ల నాగేంద్రచౌదరి, బోదిరెడ్ల సుబ్బారావు, మండపాక అప్పన్నదొర, వేగి రామకృష్ణ, పెంటకోట సత్యనారాయణ, బొడ్డేటి సుమన్, డిఇ ప్రసాదరావు, ఎఇ సంతోష్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

కార్టూ'నిజం'



కార్తీకమాసం ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి నవంబర్ 18 వరకు జరిగే కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్, ఇఒ వీర్ల సుబ్బారావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యప్రభ మాట్లాడుతూ భక్తులకు ఎక్కడ ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అంచనాలకు మించి వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకుని సదుపాయాలు కల్పించాలని సూచించారు. పారిశుధ్య, వైద్య, అగ్నిమాపక, పోలీస్, ఆర్ అండ్ బి, ఆర్‌టిసి, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. తెప్పోత్సవం, గిరి ప్రదక్షిణ, జ్వాలాతోరణం వంటి పర్వదినాల్లో యాత్రికులు అధికంగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పంపా నది వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. గత ఏడాది కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, ఆ ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కార్తీక మాసం నెల రోజులపాటు తీసుకుంటున్న చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు ఎంఎల్ఎకు వివరించారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ



వినియోగదారునికి స్కూటర్‌ను అందజేస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

ఎలక్ట్రిక్ బైక్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని సినిమా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఐశ్వర్య వారాహి మోటార్స్ ఆంపియర్ ఎలక్ట్రిక్ బైక్ షోరూంను ఎంపి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్ఎ వనమాడి కొండబాబు బుధవారం ప్రారంభించారు. ఆంపియర్ ఎలక్ట్రిక్ బైక్‌లో ప్రీమియర్ వెర్షన్ ఆంపియర్ నెక్సస్ బైక్ రిబ్బన్ కట్ చేసి తొలి కస్టమర్‌కు వారు అందించారు. అనంతరం మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబుతో కలిసి ఎంపి ఎలక్ట్రిక్ బైక్‌ను నడిపారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేత కంతేటి చిన్ని మాట్లాడుతూ తమ షాపులో అన్ని రకాల కొత్త మోడళ్ళు సామాన్యుడికి అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధి బాబ్జీ, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్, జనసేన నాయకులు మహమ్మద్ హబీబ్ బాషా, టిడిపి నాయకులు బచ్చు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాకినాడ

వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో ఆదిత్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటడం అభినందనీయమని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు అన్నారు. తమ కళాశాలకు చెందిన వివి.వర్షిత్, కె.దేవిప్రియ, కె.రేఖభవాని వ్యాసరచన పోటీల్లోనూ, చిత్రలేఖనం పోటీలలో ఎ.సాయిపవన్, ఎ.బుజ్జమ్మ, వై.శైలజ ప్రథమ ద్వితీయ తతీయ బహుమతులు సాధించారని తెలిపారు. విజేతలను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నాయుడు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

వేర్ వేరే ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారని తుని రైల్వేస్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం గుర్తుచిక్క రైల్వే లైన్ పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. అలాగే కొత్తూరు గ్రామ సమీపంలో 45 నుంచి 50 సంవత్సరాల వయస్సుగల గుర్తు తెలియని మృతదేహం రైల్వే లైన్ వద్ద పడి ఉందని గుర్తించినట్లు తెలిపారు. బయ్యవరం, కొంతకోట రైల్వే స్టేషన్ మధ్యలో 23 సంవత్సరాల వయసుగల యువకుడు చెన్నై నుంచి హౌరా మెయిల్ ట్రైన్‌లో ప్రయాణం చేస్తూ జారిపడి మృతి చెందారని తెలిపారు. ఆతని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మూడు మృతదేహాలను తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

బాలిక మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని దమ్మెన్ను కాలువలోకి దూకిన బాలిక మృతదేహం మోర్త సరిహద్దు ప్రాంతంలో బుధవారం లభ్యమైంది. ఉండ్రాజవరం ఎస్ఐ డి.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక మంగళవారం యథావిధిగా కళాశాలకు వెళ్లింది. బస్సులో తిరిగి ఇంటికి బయలుదేరింది. దారిలో బస్ దిగి, పక్కనే ఉన్న కాలువలోకి దూకేసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ డి.రవికుమార్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నిల్వ ఉంచిన బాణసంచా సీజ్

ప్రజాశక్తి - గోకవరం

పోలీసులు దాడులు చేసి రెండు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని సీజ్ చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ పర్యవేక్షణలో కోరుకొండ సిఐ సత్యకిషోర్ ఆదేశాల మేరకు, గోకవరం ఎస్ఐ పవన్ కుమార్, ట్రైనీ ఎస్ఐ నాగమణి ఆధ్వర్యంలో గోకవరం, కొత్తపల్లిలో రెండు చోట్ల బుధవారం దాడులు నిర్వహించారు. రూ.40వేలు విలువ చేసే అక్రమంగా నిల్వ ఉంచిన బాణ సంచాను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కొత్తపేటలో...

అక్రమంగా నిల్వచేసిన బాణసంచాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్‌ఎస్.నగర్ లో బాణసంచా సామగ్రి నిలువచేసార్ను సమాచారం మేరకు రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్ తో కలిసి దాడి చేశామన్నారు. యర్రం శెట్టి మురళీకృష్ణ ఇంటి పక్కన నిలువ చేసిన రూ.1,04,730 విలువ గల 203 కేజీల గంధకం, పోటాషియం, బొగ్గు పొడి, క్లోరైడ్, వంటి సంబంధిత సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశువుల కంటైనర్ సీజ్

ప్రజాశక్తి - కొవ్వూరు

ఎలాంటి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీని మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ వి.విజయకుమార్ తెలిపారు. పట్టణంలో గ్రామ ఐండియా టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో అందిన సమాచారంతో కంటైనర్ లారీని తనిఖీ చేయగా దానిలో 32 పశువులను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. పాల్వంచ నుంచి సూళ్లూరు పేటకు వీటిని తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. డ్రైవర్ నక్క వెంకట్రావు తో పాటు అతని సహాయకుడు గాదె అంజిని అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. నిందితులు ఇరువురూ గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట గ్రామానికి చెందిన వారన్నారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను సామర్లకోట సమీపంలోని వి.వేమవరం గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

గాయపడిన తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన మండలంలో దొమ్మేరు గ్రామానికి చెందిన నీరుకొండ సుబ్బారావు అనే తాపీ మేస్త్రి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడనిపట్టణ హెడ్ కానిస్టేబుల్ మోటూరి సత్యనారాయణ తెలిపారు. గత నెల 22న సుబ్బారావు దొమ్మేరు సావరంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పై అంతస్తు నుంచి జారి పడ్డారు. అప్పటి నుంచి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు.

ఏడుకొండలు కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ ఏడుకొండలు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏడుకొండలు మృతి పట్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, స్థానిక నాయకులు కాశి లక్ష్మణస్వామి సంతాపం వ్యక్తం చేశారు.

మ్యూజియంను వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మ్యూజియంను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని పలువురు వైసిపి కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కోరారు. బుధవారం రావు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ మ్యూజియంను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలు సందర్శనార్థం అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవరావు, వాసంశెట్టి గంగ, రఫీ, నాయకులు చింత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్ తప్పనిసరి

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ కార్యకలాపాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఐసిడిఎస్ పీడీ సిహెచ్. లక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం జరిగింది. సిడిపిఒ జీవన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ-స్కూల్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వ హించాలన్నారు. అంగన్‌వాడీలకు సంబంధించి విన డేటాను సమయానికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, తప్పడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 16వ తేదీ నుంచి పోషణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు ఎస్. పూర్ణిమ, వై.లక్ష్మి, ఎ. జ్యోతి, వెంకటలక్ష్మి, పద్మావతి, శ్రీలత, దుర్గాదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ లక్ష్మి

సత్యనారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పోలీస్‌స్టేషన్ అడిషనల్ ఎస్ఐ ఆచంట సత్యనారాయణ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. బుధవారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో సత్యనారాయణ ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఎస్ఐ పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, నాయకులు దాట్ల పద్మీ, కుడుపూడి శివన్నారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, వేగేశ్న భాస్కరరాజు, టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి వరకూ సత్యనారాయణ విధినిర్వహణలో అనేక ధైర్య సాహసాలు ప్రదర్శించి పలువురి మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం సత్యనారాయణ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్‌బాబు, అత్తిలి బాబూరావు, వాసంశెట్టి శ్రీనివాస్, మల్లాడి వరద రాజు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సత్యనారాయణను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

వైద్య విద్య ప్రయివేటీకరణ దారుణం

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణమని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన వైసిపి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు దక్కకుండా చేసేందుకే కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటీకరణకు పూనుకుంటుందని విమర్శించారు. తక్షణమే పిపిపి విధానాన్ని రద్దు చేయాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం పేరుతో ప్రజలను కూటమి ప్రభుత్వం దోచుకుంటుందని విమర్శించారు. కుటీర పరి శ్రమగా నకిలీ లిక్కర్ తయారవుతుందన్నారు. మద్యం విక్రయాల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట రాంజీ, చలగల దొరబాబు, రామకృష్ణ మూర్తి, మద్దిపట్ల రామకృష్ణ, రావుల రాజా, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్ఎ జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

జగ్గంపేట మండలంలోని పలువురు కుటుంబాలను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధ వారం పరామర్శించారు. రామవరం గ్రామ నికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు తండ్రి అడబాల మునియ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జగ్గంపేటకు చెందిన ప్రముఖ వ్యాపారి గోలి శ్రీరాములు భార్య వరహాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గండేపల్లికి చెందిన జర్నలిస్టు అడపా సాయి అనారోగ్యంతో ఉండటంతో ఆయనను ఎంఎల్ఎ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్. అప్పలరాజు, అడపా భరత్, జీను మణిబాబు, అనుకుల శ్రీకాంత్, పాండ్రంగి రాంబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, సర్పంచ్ లక్ష్మణరావు, కేబుల్ ఆపరేటర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండారు కృష్ణమూర్తి, సామర్లకోట ఫైబర్ నెట్ ఎండి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

సిజెఐపై దాడికి దళితుల నిరసన

ప్రజాశక్తి - తంటికొండ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై జరిగిన దాడికి వ్యతిరేకంగా దళితులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం అన్నవరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయి శ్రీనివాస్, బండి చిట్టిబాబు, పిల్లి బాబ్జి, సూర్యారావు, బుట్టి సింహాచలం పాల్గొన్నారు.

బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కరప, పెద్దాపురం

కరప పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాల్లో సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, ఎస్ఐ టి.సునీత తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల యాజమాన్యులకు పలు సూచనలు చేశారు. భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సిఐ సూచించారు. పెద్దాపురం పట్టణంలోని పలు బాణసంచా తయారీ కేంద్రాలను సిఐ విజయశంకర్, తహశీల్దార్ వెంకటలక్ష్మి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్

ప్రజాశక్తి - పిఠాపురం

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మండల టిడిపి అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బొడెడ్డి గోపి, మూరి నారాయణస్వామి, యండగండి నాగబాబు, కోణాల వెంకటరమణ, గ్రామ శ్రీను, కూటమి నాయకులు కోరాడ గాంధీ, జొన్నాడ వీరబాబు, షేక్ ఇమామ్, ఎంపిడిఒ సిహెచ్.రవికుమార్‌వర్మ, ఎంఇఒ బి.అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జెడ్ రాగంపేట పిహెచ్‌సి వద్ద రోగులతోపాటు, వారి సహాయకులకు భోజనం వంటివి చేసేందుకు నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొందరలోనే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పిహెచ్‌సికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందుకు అవసరమైన భోజనశాల భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని అన్నారు. త్వరలోనే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, భూపాలపట్నం ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాయి సాయి, నలమాటి ఆనంద్, తోట అనిల్ పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చేబ్రోలులోని పట్టు పరిశ్రమ కేంద్రం వద్ద పట్టు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ మల్బరీ తోటల పక్కనే ఉన్న పత్తి పంటకు బయో కెమికల్స్ మందులు పిచికారి చేయడం వల్ల మల్బరీ ఆకులు తినడం వల్ల పట్టుపురుగులు గూడు కట్టడం లేదన్నారు. దీనివల్ల లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సెరికల్చర్ డిడి టి.రాజేంద్రప్రసాద్‌బాబు, శాస్త్రవేత్త ఇ.భువనేశ్వరి మాట్లాడుతూ అధిక మోతాదులో మందులు ఉపయోగించడం అనుమతి లేదని, గాలి ద్వారా మల్బరీ తోటలకు వ్యాప్తి చెంది పట్టు పురుగు గూడు కట్టడం లేదన్నారు. ఈనెల 15న అగ్రికల్చర్, సెరికల్చర్ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో రైతులు, అధికారులతో ప్రత్యేకంగా చర్చించి తగు నిర్ణయాన్ని తీసుకుంటామని అన్నారు. పంటలను సస్య రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సదస్సులో చేబ్రోలు పట్టు పరిశ్రమ ఎఎస్ఒ సత్యనారాయణ, ఓరుగంటి శివ, ఏసు, దూళిపూడి సత్యనారాయణ, పట్టు రైతులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సెరికల్చర్ డిడి


వస్తువులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ యనమల దివ్య

జిఎస్‌టి తగ్గింపుతో మేలు

ప్రజాశక్తి - కోటనందూరు

జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. బుధవారం పట్టణంలో జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిఎస్‌టిలో మూడు స్లాబులు ఉండేవని, ప్రస్తుతం రెండు స్లాబులకు కుదించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులను ఎంఎల్ఎ దివ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు, కూటమి నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యెల్లా వెంకట కృష్ణారావు, మోతుకూరి వెంకటేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కుచ్చర్లపాటి రూపాదేవి, ఆచంట సురేష్, ఛాంబర్ అధ్యక్షుడు సకురు నాగేంద్ర నెహ్రూ, జిఎస్‌టి అధికారులు దయానంద్, పి.ధర్మారావు, మాధవీలత, ఎంపిడిఒ వెంకటనారాయణ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు తెలజ ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫేస్‌బుక్ బృందం వడ్డి సత్యనారాయణ, సత్యప్రకాశ్, జయశ్రీ, నాగలక్ష్మి, కె.లక్ష్మి, రాజేష్‌కుమార్, ఉమా శేఖర్, సత్య పాల్గొన్నారు.